# అంధత్వం

ఆయపిళ్ళ సత్తిబాబు

చలి గజగజ లాడించేస్తోంది. రాత్రి అవుతోన్న కొద్ది మంచు, వర్ష బిందువుల్లా రాల్తున్నయ్ — సినీమాట ముగియగానే 'జోగి' నేలను పరచిన గోని గుడ్డను ధూళిదులిపి బుజాన్ని చుట్టేడు. బొడ్డున ముడవటానికి ఏమయినా వుంటేగా! అతణ్ని అనుసరించే లేచింది కోలీ కూడ. ఏదో నిస్సత్తువ నిరాశ, కాళ్ళను చుట్టుకుని బలంగా ఆపేస్తున్నాయి. కోలీ అతని బుజంపైని చెయ్యివేసి తనుముందుగా నడుస్తోంది. అతడు ఆమె అడుగుల్లో అడుగులు లెక్కవేసుకుంటూ నడుస్తున్నాడు.

సినీమానుంచి వచ్చిపోయే జనం కార్లపైని బళ్ళపైని అలా రాసుకునే పోతూన్నె యేదోకోపం వచ్చి లేచిపోయిన వాళ్ల కోలీ జోగులు మౌనంగా— మేడలు—బజార్లు—పట్టణం అన్నివిడిచి ఊరు బయట తమ విడిదికి వచ్చారు.

జోగి మతిపోయినవాడల్లె అరుగుపై చతికిలబడిపోయాడు. ఆమె రెండడుగులు ముందుకు నడచి తిరిగి చూసింది. జోగి అలానే పడుక్కుని చెక్కుతున్నాడు.

"ఏం జోగన్నా" ఆమె పిలిచింది.

అతడి ఎర్రపడ్డ నేత్రాల్లోంచి రెండు బొట్లు రాలాయి.

"ఏంవా ?... నే నెందుకు బతకడంవాఅని"—

"ఏం ?"

"మూడురోజులయి కూసింత గంజి లేదుకదా! పరిచినగుడ్డపరచినట్టుగే బుజాన్ని వేస్తున్నాం...ఒక్కరాగి దమ్మిడీ వేసిన ప్రభువు—ఒఖ్ఖటి—ప్రభువులు!! నాలాగే వాళ్లుంటే మూడు ప్రొద్దుల్తోమాడి ఛస్తూన్న పాడుపొట్టను అవగాహన చేసుకో గలిగారూ"...అతడి ముక్కు చలమలదురుతున్నె...మాటల్లో విచారం లేకపోయినా, ఓ విధమయిన కోపం, దహించుకు పోతూన్న పేగుల్లోని నిస్సత్తువా ఓర్పు లేనితనాన్ని తెలియపరుస్తున్నె.

ఆమె అతడికి దగ్గరగా కూచుంది. "ఏమన్నా బీదోళ్ళంకదా మనకూ కోపమే, ప్రభువులు మనలా యెంగుకవాల ?

అమ్మో! మనలానే ? -మన లాగనయితే ఒక్కపూట, ఒక్కఘడియ తాళగలరూ?—ప్రభువులు కనకనే దమ్మిడీ ఇవ్వరు... మాటకు— ప్రభువ్వయితే మట్టుకు నువ్విస్తావేమిటి ?...అతడు మాట్టాడలేదు. ఉబికి వస్తోన్న కోపాన్ని మట్టుకి తళ్ళాంతి చేసుకో గలిగాడు.

ఆమె లేచింది—"వెళ్తా నన్నా... మాపిటికి (రాత్రికి) కళ్ళుముయ్య... రేపటికి ఆలోచింతాములే (ఆలోచించుదాము) అట్టే మనసులో ఊసు (ఊహ) లెట్టుకోక—" కాస్త కుషామతుచేసి ఆమె ఆ నడి చీకట్లో మెల్లిగా వారితీసింది.

*　　*　　*

ఇంకా సూర్యుడు అస్తమించనూ లేదు— పిట్టలు గూళ్ళకు చేరనూ లేదు. బయల్దేరారు కోలీ జోగులు పొట్ట కూలి కోసం—దారి మధ్యలో ఆమె అంది" అన్నా— ఇవ్వాళనీకాడ (దగ్గిర) కూకోని దండాలని (అడుక్కోవాలని) లేదు."

"ఏం ?"

ఇద్దరం ఓకాడే కూకుంటే వేసే ప్రభువుచూసి వెళిపోతున్నాడు—వేసిన ప్రభువు వేసిన యిద్దరకూ వంతేగా"

అతడు గతుక్కు మన్నాడు—"నువ్వొరెళ్లేది అందుకేనా?—నీ కొచ్చిందినీకే నన్నమాట-డబ్బంటే-

ఆమె తన సున్నటి వేళ్ళతో అతడి బుగ్గల్ని నొక్కింది "ఎంత మాటన్నా...రెండు చోట్ల డబ్బు దొరకవచ్చునకదా అని...వెయ్యాలనుకున్న ప్రభువు నువ్వన్నా వేస్తారు— నేనున్నా వేస్తారు. ఇంకో చోట జోలిపరుస్తే రెండు చోట్ల దండవచ్చు కదూ ?"

"ఇంతకూ నసీబు ప్రధానం—అయినా కానీ కాదనడం యేల యెక్కడ కూకున్నా (కూర్చున్నా)

కూసింత బేగి (కొంచెం వేగంగా) బయలెల్లి వస్తే కలిసి వెళ్ళవచ్చు—"

"అలాగే నన్నా, సినీమా బగ్గేగానే (విడిచీగానే)—...నీ కాడికి వచ్చేస్తాను...తొందరపడి లేకుమా (లేవకుమా)...అసలే నీకోపం...కలబడి కొట్టేస్తారు ప్రభువులు"

అతడామె చేతుల్ని రెండూ పట్టుకుని ముద్దులాడేడు. "కోలీ నేనంటే నీకెంత అభిమానం... నువ్వు లేకపోతే నాకు కూడేదీ ?....నివ్వే (నువ్వే) లేకపోతే నాకు దివ్వేదీ... నా కోలీ.... నా ముద్దు కోలీ"...

కోలీ అతడి బుగ్గల్ని రెండూ వోమారు ఆడించింది. "నువ్వుకదన్నా, దారిపొయ్యే దిక్కులేని పక్షిని పెద్దదాన్ని చాస్త. తల్లి తండ్రి పోగానే నువ్వు దరిచేర్చక పోతే ఏనాడో చచ్చుండేదాన్ని.... బతికుండి....యిలా నీచ జీవనం చేస్తూన్నది కాక... ఇంకా నిన్ను కూడ దగా చెయ్యాలన్నా..."

..."సినీమా వచ్చింది...జోలు నేలనుపరచి జోగిని కూచో పెట్టి, తను వెళ్ళిపోయింది కోలి ఆవలి గేటుకి—"

...సినీమాలోకి రకరకాల మానవులు వింత వింతదుస్తుల్తో వెళ్తూ నేవున్నారు...వస్తూ నేవున్నారు. గేటు వద్దునే నిల్చుంది కోలీ ఒక్క చేతిని ముందుకు చాపి...18 ఏళ్ళయినా వుంటవో లేదో స్త సందయిన దేహం...వొంపులు విరిగిన ఊరూభాగం మిలమిలా మెరుస్తూంది విద్యుద్దీపాలముందు. ఆ నీలి వెల్తుర్లో ఆమె కోల మొహం...చలించే అధరాలు...భయించాత కలిగిన బిత్తరిచూపులు ..కదుత్తే మెరుపులు కలిగిస్తున్నాయివొంట్లో...తను వెళ్తూన్న దెక్కడికో—చూస్తూన్న దేమిటో...మతులుండి వెత్తేగా...మనుషులకి !...జేబులో చెయ్యవేసి ఎంతవస్తే అంత... ఆమె చేతిలో చెయ్యివుంచడం కావాలి...ఇంకా ఓరచూపు వోచిరునవ్వు...ధైర్యంవుంటే ఓప్రశ్న... జంకుతేగా కోలీ మట్టుకు...ఎవరిమట్టుకువాళ్ళకు జబాబులిస్తోనేవుంది. సరిపోయి నట్టుగ...రహస్యాలాడుతోనే వుంది...

గప్పు వెలిగాయి లైట్లు...కోలీ పరుగెత్తింది జోగిదగ్గరికి...జోగి అరుస్తోనేవున్నాడు...వరుసవరుసలుగా దేవుళ్లని మానవుల్ని పిలుస్తోనే వున్నాడు...బ్రతిమాలుతోనే వున్నాడు...తిడుతున్నాడు కూడ...ఏంచేసినా...ఎవర్ని పిలిచినా... టంగున ఒక్కదమ్మిడీ క్రిందపడితేగా !...

"లే అన్నా,"—

"లేవడమా?...ఎందుకూ...కూడులేనితర్వాత యెక్కడికయినా చావడానికేకదూ.....చచ్చేది యిక్కడే చస్తాను"—

"కూడు నేనిస్తాను... బేగి లేవన్నా—కాలం చెయ్యక—ప్రాణాలు పోతయే..."

జోగి గబుక్కునలేచాడు—ఇద్దరూ తొందరగా నడిచి ఇంటికి చేరుకున్నారు.

"కోలీ,!—ఏమిటి సంగతి"—చిరిగిపోయిన చాపమీద బైటాయిస్తూ ప్రశ్నించాడు జోగి... కోలి అతని ప్రక్కనేకూర్చుని కొంగున కట్టినమూట యిప్పింది. "అన్నా,...యిదిగో....యిది అణా... ఇది పావలా....ఇది రూపాయ్...ఇది కాయితం సుమా....జాగ్రత్త"—ఒక్కొక్కటే ఆనవాలు చెబుతూ అంధుడిచేతిలో పెడుతూంది.

జోగి అన్నీ తీసుకున్నాడు. అతడి సంతోషానికి అంతులేదు. అతడు తన జీవితకాలంలో చూస్తేనా అంత డబ్బు..."కోలీ....నువ్వు నా తల్లివి....ఎంత డబ్బు....ఇచ్చావు....నీపేరు చెప్పి—కూసింత కల్లు తాగుతాను...

కోలీ లేచింది "జాగ్రత్తగా మెసులుకో-... నీకోసం....పస్తులు చూడలేక....సంపాయించిన సొమ్ము...ఏడాదివరకూ సుఖమయిన జీవితం చెయ్యొచ్చు-...."

"కోలీ—! ఒక్క మాట—"

కోలీ తిరిగిచూచుంది.

"ఇంతడబ్బు ఎక్కడ దొరికింది. అడుగుతున్నానని అనుకోకేం-...."

"ఎలా వస్తుందన్నా... నేనూ నీలాగే చెయ్యి చాపేను. దయవున్న ప్రభువులంతా తలొకటివేసి వెళ్లేరు."

"ఊరికే చేస్తారా ప్రభువులు." తనకు వెయ్యలేదన్న యీర్ష్యతో కోపంగా అన్నాడు జోగులు.

"చెప్పేది వినూ.... వేసేటప్పుడు కొంతమంది నవ్వారు...కొందరు ఆటయేవరకూ వుండమన్నారు. ఆట కాకుండా వచ్చారన్నా. యిద్దరు ప్రభువులు... ఇంటికి రమ్మన్నారు....కాల్లోను..."

"వెధవడబ్బు... అదా....ధైర్యంగా అడుక్కు తెచ్చిందనుకున్నాను...పటుకుపో నీడబ్బు జోగులు కోపంగా డబ్బు నేలపడేశాడు...

"అగన్నా! అంత అన్యాయ మనుకున్నావేమిటి—ఇదీ అడుక్కు తెచ్చిందే"—

"ఆ!—అడుక్కు తెచ్చింది!...వెళ్లేవా... కాల్లోను..."

కోలీ అతడి బుగ్గపై చిన్న లెంపకాయ కొట్టింది.

"ఏమిటామాట, వినూ! వాళ్లను క్షమించమన్నాను...నా భర్త యిక్కడనే వున్నాడని చెప్పేను...చూపమన్నారు—నిన్ను చూపేను"—

"ఆఁ...నిజంగానే...వాళ్లు నమ్మేరూ?!!"—

"నమ్మకేం చేస్తారు...మళ్లా తిరిగి రేపు... ఒక్కరినీ రమ్మన్నారు"

"ఊఁ—గాడిదలు...నే నుండగా వాళ్లు అడుగెయ్యడమే"

మీసాలు మెలివేశాడు జోగులు.

"ఆ ధైర్యమే నాకుందన్నా"

జోగులు ఆమె భుజమ్మీద చెయ్యివేశాడు." నిజంగా, నేనే భర్తనని చెప్పేవా?"

"ఒట్టన్నా...మరి తప్పకోడమెలాగ" ఆమె అతడిచేతిలో చేతిని వేసింది.

"కోలీ—నువ్వింత ప్రేమ చూపెడుతున్నావని అనుకోలేదు...కోలీ...నిజంగా డబ్బు లేకపోబట్టి... వుంటేనా...ఈ పాటికి——"జోగులు ఆమెను దగ్గరగా తీసుకుని కౌగలించుకోపొయ్యాడు...కోలీ గబుక్కున లేచింది "ఏమిటన్నా?"—

"ఏమీ లేదూ...డబ్బుందిగా... అడుక్కు తినక్కర్లేదు—మనిద్దరంవుంటే ఎంత ఆనందం"...

"ఎప్పుడూ లేనిది...యేమిటన్నా...యిదివరకు కలిసి లేమూ?"

అంధుడు తణువుకుంటూ లేచాడు. ఎక్కడికెళ్తావు. యింత అర్ధరాత్రప్పుడు...నాకుమట్టుకు యెవరున్నారు. నివ్వు తప్ప...ఇష్టంవచ్చిన యేలుబడి...నీదగ్గరకు యేమగాడు రాగలుగుతాడో చూస్తాను"...

కోలీ గ్రహించింది. కొన్ని నిముషాలుకుముందు అతడు తిండికిలేక చావటానికి పూనుకున్నాడు... డబ్బులేనన్ని రోజులు నన్నెంతో గౌరవించాడు... తను యెలా చెపితే అంతే చేసేవాడు...కాని అతడి బాధలు తను చూడలేక చేసినందుకు ఫలితం...డబ్బు ఎంత నీచం!-...డబ్బు ఇచ్చిన తనుకూడ...దానిదగ్గిర నీరస పడిపోయింది...ప్రపంచం అర్థం చేసుకోలేని పుట్టంధుడుకూడ డబ్బు చూడగానే...ఎంత నీచానికి పాల్పడుతున్నాడు...అంధుడు మెల్లిగావచ్చి ఆమె చేతుల్ని అందుకున్నాడు...

"కోలీ!"—ఆమె పారిపోటానికి ప్రయత్నించలేదు. ఎక్కడికిపోతుంది...తన్ను సోదరికన్నా...యెక్కువగా ప్రేమించిన...అంధుడు... ఇంత అవినీతికి జోహారు చేస్తున్నప్పుడు...తను యెక్కడికిపోయి యేంచేస్తుంది. "అన్నా...క్షమించవూ—" అతడు వినలేదు...ఆమె తిరిగి చెప్పింది... "నా శరీరాన్నే కాదు నా ప్రాణాన్నే యిస్తున్నాను...కాని...అన్నా...ఒక్కటి... ఎప్పట్లానే అడుక్కుతినే కాలక్షేపం...చేస్తూ వుందూ"— ఆమె జోగులు హృదయమ్మీదికి ఒరిగిపోయింది... అంధుడు తన యిష్టమొచ్చిన చోటెల్లా ఆమెను ముద్దులు పెట్టుకుంటున్నాడు- నేలనున్నడబ్బు గలగల నవ్వుతూంది.